# అప్రమత్తంగా ఉండాలి

- కొత్త వేరియంట్‌పై మలక్‌పేట ఏరియా దవాఖానలో వైద్యుల సమావేశం
- సిబ్బంది,మందులు సిద్ధంగా ఉంచాం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బీసీ మల్లికార్జునప్ప

సైదాబాద్, డిసెంబర్ 21 : నగరంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కరోనా కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో మలక్‌పేట ఏరియా దవాఖాన వైద్యులు అప్రమత్తమయ్యారు. వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మలక్‌పేట ఏరియా దవాఖానలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బీసీ మల్లికార్జునప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీసీ మల్లికార్జునప్ప మాట్లాడుతూ కొత్త వేరియంట్ జేఎన్-1ను ఎదుర్కొవటానికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వంద పడకల దవాఖానలో వైరస్ సోకిన వారికి వైద్యం అందించటానికి ప్రత్యేక వార్డును ఐసోలేషన్ చేసి 8 బెడ్స్‌ను సిద్ధం చేశామని తెలిపారు. అదే విధంగా దవాఖానలో 130 ఆక్సిజన్ బెడ్స్ అందుబాటులో ఉన్నాయని, అవసరమైనప్పుడు వైద్యం అందించటానికి అన్ని సౌకర్యాలను కల్పించామని తెలిపారు. కొవిడ్ టెస్టలకు సంబంధించిన కిట్స్, వెంటిలేటర్స్, ఆక్సిజన్ కాట్స్ వంటి అనేక అంశాలను చర్చించి వాటికి సంబంధించిన ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ప్రజలు వైరస్ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవడంతోపాటు, కరోనా వచ్చిన వారికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లపై చర్చించారు. ప్రభుత్వం దవాఖానల్లో కరోనా వైద్య చికిత్సలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తాము దవాఖానలో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించుకోవటం జరుగుతుందని తెలిపారు. కరోనా బారిన పడిన అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఇంతవరకు ఇక్కడికి రాలేదన్నారు. వ్యాధి తీవ్రత పెరిగితే అవసరమైన సేవలు అందించడానికి దవాఖానలో వైద్యులు, మందులు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ సురేశ్, సివిల్ సర్జన్లు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ యాదయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, ఆఫీస్ సూపరింటెండెంట్ కరుణాకర్, డాక్టర్ దయాకర్, వీరేశ్, మంజులత,కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి



చెక్కులు అందజేస్తున్న సహకార సంఘం చైర్మన్ దవాణాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 21 : రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తుందని చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ బొమ్మ దవాణాకర్‌గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని చిన్నగోల్కొండ సహకార సంఘంలో 24 మంది రైతులకు రూ. 19లక్షల చెక్కులను పంపిణీ చేశారు. డైరెక్టర్లు ప్రశాంత్‌రెడ్డి, పాశం విజయలక్ష్మి, సీఈవో యాదయ్య, సురేశ్, మధుమతి పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బండ్లగూడ, డిసెంబర్ 21: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని రాక్ చర్చిలో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ చర్చి క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బీజేఎంసీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని చర్చిల పాదర్లు, బిషప్‌లు, రెవరెండ్లు, పాస్టర్లు, ప్రజలు, నాయకులతో యునైటెడ్ క్రిస్మస్ సంబురాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు స్వామిగౌడ్, కార్పొరేటర్ సురేశ్ గౌడ్, ప్రముఖ అంతర్జాతీయ సువార్త ప్రసంగికులు ఎడ్వర్డ విలియమ్స్, మన్నా మినిస్టర్ కో వ్యవస్థాపకులు బిషప్ రేచల్ కొమనాపల్లి హాజరై వేడుకలను ప్రారంభించారు.

## సెల్‌ఫోన్లు పోతే సీఈఐఆర్‌ఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి

బండ్లగూడ, డిసెంబర్ 21: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్‌ఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల కాలంలో రాజేంద్రనగర్ ఏసీపీ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్‌లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్‌ఎం యాప్ ద్వారా ఫోన్లను గుర్తించి వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం టెలికం సంస్థ ద్వారా సీఈఐఆర్‌ఎం ఆఫ్ తీసుకొచ్చిందని, ఇది మొబైల్ వాడకం దారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.గతంలో కూడా ఈ యాప్ ద్వారా సుమారు 200 మంది బాధితులకు సెల్‌పోన్లు అప్పగించామన్నారు. సమావేశంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, పులి యాదగిరి పాల్గొన్నారు.


## వంతెన నిర్మాణంలో మార్పులు చేయాలి



మాట్లాడుతున్న విర్గో సంక్షేమ సంఘం సభ్యులు

మలక్‌పేట, డిసెంబర్ 21: మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద రూ.52 కోట్లతో నిర్మించనున్న ప్రతిపాదిత వంతెన నిర్మాణంతో దాదాపుగా 40 మంది వారి ఆస్తులను పూర్తిగా కోల్పోవాల్సి వస్తున్నందున, ఎవరూ ఆస్తులు కోల్పోకుండా వంతెన నిర్మాణాన్ని తగ్గించాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాత్రి మూసారాంబాగ్ బ్రిడ్జివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విర్గో(బాధిత)సంక్షేమ సంఘ సభ్యులు మాట్లాడుతూ మూసారాంబాగ్ వంతెన నిర్మాణాన్ని దుర్గం చెరువుపై నిర్మించిన వంతెన మాదిరిగా నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, రహదారికి ఇరువైపులా మార్కింగ్ చేశారని వారు తెలిపారు. అయితే వంతెన నిర్మాణంలో భాగంగా రోడ్డుకిరువైపులా చేపట్టనున్న విస్తరణ పనులకు సంబంధించి ఒక వైపు 16.6 ఫీట్లు, మరోవైపు 51.10 ఫీట్లు పెంచుతూ మార్కింగ్ చేశారని వారు తెలిపారు. ప్రతిపాదిత వంతెన 29.5 మీటర్ల వెడల్పుతో రూపొందించబడిందని, ఇరువైపులా మూడు లేన్ల రహదారితోపాటు 3.5 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా పుట్‌పాత్‌ను ఏర్పాటు చేయనున్నారని, ఈ విధంగా నిర్మాణం చేయటం ద్వారా వంతెన అవతలి వైపు, ఇవతలి వైపు బ్రిడ్జికి ఇరువైపులా(మూసారాంబాగ్, అంబర్‌పేట వైపు) ఒకవైపు ఉన్న వ్యాపార సముదాయాలకు సంబంధించిన 40 మంది పూర్తిగా ఆస్తులను కోల్పోవాల్సి వస్తుందని వారు తెలిపారు. వంతెన నిర్మాణాన్ని 29.5 మీటర్లకు బదులుగా 18 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తే ఎవరూ ఎలాంటి ఆస్తులు కోల్పోవాల్సిన అవసరం ఉండదని వారు పేర్కొన్నారు. ఈ విషయమై తాము పురపాలకశాఖ మంత్రికి, సీఎం సెక్రటరీకి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులకు, మలక్‌పేట, అంబర్‌పేట, ఎల్‌బీనగర్ నియోజకవర్గ శాసన సభ్యులకు, జీహెచ్‌ఎంసీ మేయర్‌కు, జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌కు, జోనల్, డిప్యూటీ కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. విర్గో సంక్షేమ సంఘ అధ్యక్షుడు, క్రిమినల్ కోర్టు న్యాయమూర్తి భాషా నవాజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు ఎంఎస్. నిరంజన్ సాగర్, కార్యదర్శి రాజశేఖర్, అసిస్టెంట్ కార్యదర్శి ప్రకాశ్, కోశాధికారి ధనుంజయ, సలహాదారులు రవీందర్‌రెడ్డి, ప్రకాశం, అశోక్‌కుమార్, దశరథ్‌గౌడ్, పెంటయ్య, వెంకటేశ్, తయీూస్ అహ్మద్, అన్సారీ, లింగం, మోయిజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కష్టపడి పని చేయాలి



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కష్టపడి పని చేయాలని స్టూడెంట్ ట్రైబ్ యాప్ వ్యవస్థాపకుడు చరణ్ లక్కరాజు అన్నారు. గండిపేట్‌లోని గురువారం మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కేరీర్ డెవలప్‌మెంట్ సెల్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సెమినార్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యసురేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. –మణికొండ, డిసెంబర్ 21:

## రైతు దినోత్సవం



రైతులు దేశానికి వెన్నెముక అని ఆర్యన్ పాఠశాల ప్రిన్సిపాల్ సచిన్ జైస్వాల్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆర్యన్ పాఠశాలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పూజ, షసైలీ, సునీత, రాధిక, రంజనా, పద్మ పాల్గొన్నారు.

–మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 21:

## ‘నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్’

సైదాబాద్, డిసెంబర్ 21 : కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం నాయకులు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలోకి రాగానే మంగళంపాడారని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగ భృతి అని తామేప్పుడన్నం, అలాంటి హామీ ఇవ్వలేందంటూ మాట్లాడటం సరికాదన్నారు.

## రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

మణికొండ, డిసెంబర్ 21: పార్లమెంటు సమావేశాల్లో భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీశ్ దంకర్‌పై చేసిన అవహేళన వాఖ్యలపై తృణముల్ కాంగ్రెస్ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీలు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కార్పొరేటర్ సంగీత, మల్లేశ్‌యాదవ్, కో కన్వీనర్ మహలింగంగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు బొక్క బాల్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు జనార్ధన్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షులు నిఖిల్, నాయకులు శంకర్‌సింగ్, నరసయ్యచారి, వెంకటచారి, శివరాజ్, శంకరప్ప, అనిల్, కృష్ణ, గణేశ్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

మణికొండ, డిసెంబర్ 21: తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఆలీ ఫారూకి ఆదేశాల మేరకు సీజీఎం ఆనంద్ ఇబ్రహీంబాగ్ డివిజన్ పరిధిలోని నార్సింగి సెక్షన్ పరిధిలోని రాందేవ్‌గూడలో క్షేత్రస్థాయిలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురువారం నార్సింగి సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్‌రెడ్డితో కలిసి నేరుగా విద్యుత్ కస్టమర్ల సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ సమీపంలో ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

మైలార్‌దేవ్‌పల్లి:జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫలక్‌నూమా ప్రాంతానికి చెందిన కరీంఖాన్ మోతీజైన్ అలియాస్ నదీమ్, పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు, మతీన్‌ఖాన్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మద్యం, గంజాయి సేవించడం వంటి అలవాట్లకు బానిసలుగా మారిన వారు సులభంగా డబ్బులు సంపాదించేందుకు దారి దోపిడీని ఎంచుకున్నారు. ఒంటరిగా వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని బెదిరించి వారి వద్ద ఉన్న డబ్బులు, బంగారాన్ని దోపిడీ చేస్తున్నారు. లక్ష్మీగూడ ప్రాంతంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారే సమాచారంతో శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. కరీంఖాన్, మతీన్‌ఖాన్‌లు హోండా యాక్టివాపై వచ్చారు. ఆపి తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా రెండు కత్తులు, డమ్మి పిస్టల్‌తో బెదిరించి రెడ్ చిలీ స్ప్రే బాటిల్ పిచికారి చేసి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి రెండు స్టీల్ కతులలు, ఒక డమ్మీ పిస్టల్, రెండు చిల్లీ స్ప్రే బాటిల్స్, సెల్‌ఫోన్‌లు, యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ

వ్యసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 21 : పెరటి కోళ్ల పెంపకం అదనపు ఆదాయమని పీవీ నరసింహరావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు కోళ్ల పరిశోధనా కేంద్రంలో కొనసాగుతున్న శిక్షణాకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలలో 30 ఏళ్ల కిందట ప్రతి ఇంట్లో పెరటి కోళ్ల పెంపకం ఉండేదన్నారు. అనంతరం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల తగ్గిపోయాయని తెలిపారు. పశువైద్య వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.ఏకాంబరం మాట్లాడుతూ తెలంగాణలో పెరటికోళ్ల పెంపకం వల్ల అనేక లాభాలున్నాయని తెలిపారు. అనంతరం రాజశ్రీ కోళ్ల పెంపకం బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ సైంటిస్టు డా.ఎస్.సాయిరెడ్డి, డా.బసవారెడ్డి, సైంటిస్ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ రవీందర్ రెడ్డి తదితరులు